కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 19, దొండ 23, గుండుబీన్స్ 80, గింజ చిక్కుడు 60, గోకరకాయ 35, కీర 16, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 26, చామగడ్డ 35, మొరంగడ్డ 21, కందగడ్డ 85, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటి కాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

25 నుంచి ఉచిత శిక్షణ

సనత్‌నగర్: బ్రహ్మకుమారీస్ ఎస్సార్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక రాజయోగ మెడిటేషన్ కేంద్రంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో వివిధ అంశాల్లో ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కల్పన, విద్యాలు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రాణాయామం, యోగాసనాలు, బ్రెయిన్ బూస్టింగ్ యాక్టివిటీస్, మోరల్, ఇన్స్పిరేషనల్ స్టోరీస్ అండ్ వీడియోస్, మొబైల్ డెడికేషన్ సెషన్, పాజిటివ్ థింకింగ్ అండ్ అఫిర్మేషన్స్ ఫర్ సక్సెస్, ఫన్ గేమ్స్ ఉంటాయని వివరించారు.

పీహెచ్‌డీ విద్యార్థులకు గడువు పొడిగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ విద్యార్థులకు మరో ఏడాది గడువు పొడిగించాలని బహుజన విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ వేల్పుల సంజయ్ రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఓయూలో 2018 అంతకంటే ముందు పీహెచ్‌డీలో ప్రవేశం పొందిన విద్యార్థులకు కరోన సమయంలో లాక్‌డౌన్ కారణంగా పరిశోధనలు చేయలేక పోయారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ విద్యార్థులకు మరోక ఏడాది గడువును పొడిగించాలని కోరినట్లు తెలిపారు.

సీసీ నగర్‌లో ఉచిత యునానీ వైద్య శిబిరం



ఉచిత యునాని వైద్య శిబిరం

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో బుధవారం ఉచిత యునానీ వైద్య శిబిరం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ యునాని మెడిసిన్ శాఖ మొబైల్ హెల్త్ కేర్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యునానీ వైద్యులు సుభాని, డాక్టర్ సాదియాలు స్థానిక ప్రజలను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు.

చెత్తను తొలగించాలి



బాపూనగర్ రోడ్లపై పేరుకుపోతున్న వ్యర్థాలు

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బాపూనగర్ బస్తీలో పారిశుద్ధ్యం వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. సుమారు ఉండగా 12 వేలకు పైగా జనాభా ఉన్న ఈ ప్రాంతానికి ఒక్క పారిశుద్ధ్య కార్మికుడు కూడా లేకపోవడంతో ఎక్కడ చూసినా చెత్త కనిపిస్తోంది. ప్రైవేటు హాస్టల్స్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రోజు పెద్ద మొత్తంలో వ్యర్థాలు పారవేస్తున్నారు. అంతర్గత రోడ్ల పరిస్థితి మరింత అధ్వాన్నంగా ఉందని, వారంలోఒక్క సారైన రోడ్లను శుభ్రం చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

'తెలుగుకు అన్యాయం చేస్తున్న ఇంటర్ బోర్డు'

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో తెలుగు సబ్జెక్టుకు ఇంటర్ బోర్డు అధికారులు అన్యాయం చేస్తున్నారని ఓయూ తెలుగు శాఖ హెడ్ ప్రొ.సాగి కమలాకర శర్మ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఇంటర్‌లో ద్వితీయ భాషగా తెలుగును కాకుండా ఇతర భాషలను ప్రోత్సహించడం దారుణమన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో సైతం సంస్కృతాన్ని ద్వితీయ భాషగా ప్రవేశ పెట్టడం తగదన్నారు. ఇంటర్ బోర్డు అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని పమీక్షించాలన్నారు.

మహాసభకు అధికసంఖ్యలో తరలిరావాలి

అమీర్‌పేట: బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభను విజయవంతం చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని సిక్కు సోదరులు ఎమ్మెల్యేను కలిశారు. 27న వరంగల్‌లో జరిగే మహాసభ సిక్కులు అధికంగా తరలి వచ్చేలా చూస్తామన్నారు. ప్రయాణ వివరాలను కార్యకర్తలకు వివరించాలని ఎమ్మెల్యే సూచించారు.

నల్లాపై నజర్..

నీటి వృథాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

- విద్యుత్ మీటర్లు వినియోగిస్తే జరిమానాలు
- తనిఖీల్లో నిమగ్నమైన అధికారులు
- ఇప్పటి వరకు 200 మోటార్లు స్వాధీనం

సికింద్రాబాద్: పదేళ్ల అనంతరం సికింద్రాబాద్ ప్రాంతంలో తాగునీటి ఎద్దడి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాజాగా మళ్లీ వాటర్ ట్యాంకర్ల సందడి ఇక్కడి రహదారుల్లో కనిపిస్తోంది. వేసవి ఎండలు తీవ్రం అవుతుండడంతో నీటి వినియోగం అమాంతం పెరిగింది. ఇదిలా ఉండగా నీటిని కొందరు వృథా చేస్తుండడం, ఎక్కువ సంఖ్యలోని నల్లా కనెక్షన్ దారులు విద్యుత్ మోటార్లను బిగించడం ద్వారా నీటిని లెక్కకు మించి లాగేస్తుండడంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఎక్కడికక్కడ



ప్రత్యేక తనిఖీలు చేస్తున్న జలమండలి అధికారులు



జలమండలి తార్నాక అధికారులు స్వాధీనం చేసుకున్న విద్యుత్ మీటర్లు

విద్యుత్ మీటర్ల వినియోగం ఎక్కువ కావడంతో తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యలు తలెత్తుతున్నాయి. నీరు మొత్తంగా సరఫరా అవని ప్రాంతాలకు ట్యాంకర్లు పంపించడం జలమండలి అధికారులకు అనివార్యం అవుతుంది.

క్షేత్రస్థాయి పర్యటనలు..

తాగునీటి పరఫరాలో వృథాను అరికట్టడం, విద్యుత్ మీటర్ల బిగించేవారిని గుర్తించి జరిమానాలు విధించడం కోసం మారేడుపల్లి డివిజన్ జలమండలి అధికారులు బిజీబిజీగా ఉంటున్నారు. ఇందుకోసం రూపొందించిన 45 రోజుల ప్రణాళికను ఈనెల 15 నుంచి అమలులోకి తెచ్చారు. సెక్షన్ మేనేజర్ అధికారి మొదలు డీజీఎం వరకు జలమండలి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నారు. నీరు వృథా అవుతున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

దొరికితే చర్యలు

నల్లా కనెక్షన్‌లకు విద్యుత్ మోటార్లు బిగించి నీటిని తోడేస్తున్న భవనాల యజమానులను గుర్తించి జరిమానాలు విధిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. త్వరలో మొబైల్ యాప్‌ను వినియోగంలోకి తెచ్చి విద్యుత్ మోటార్లు బిగించే వారందరిపై ఉక్కుపాదం మోపేందుకు జలమండలి అధికారులు సమాయత్తం అవుతున్నారు. విద్యుత్ మోటారు బిగించిన వారిని గుర్తించి వారు నీటిని తోడేస్తున్న తీరును ఫోటోలు తీసి మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. సదరు మోటార్లు స్వాధీనం చేసుకుని, జరిమానాలు విధించి వదిలేస్తున్నారు. రెండవ మారు మళ్లీ మోటారు బిగించి పట్టుబడితే మాత్రం జరిమానాలు విధించడంతోపాటు నల్లా కనెక్షన్‌ను రద్దు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రెండు వందల మోటార్లు సీజ్..

గడచిన వారం రోజులుగా జలమండలి అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మారేడుపల్లి డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్ కార్యాలయాల పరిధిలో 200 మోటార్లను జలమండలి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వారందరి వివరాలను మొబైల్ యాప్‌లో నిక్షిప్తం చేసి జరిమానాలు విధించారు. డివిజన్ పరిధిలో మొత్తంగా 37,636 తాగునీటి కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 60 శాతం మంది కనెక్షన్ దారులు ఉచితంగా తాగునీటిని పొందుతున్నారు. అయినప్పటికీ నల్లా కనెక్షన్లకు విద్యుత్ మీటర్లు బిగించడం, నీటి చౌర్యానికి పాల్పడుతుండడంతో మరిన్ని కఠిన చర్యలు తీసుకునేందుకు అధికారులు అప్రమత్తమయ్యారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన



కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: నల్లగుట్ట ప్రభుత్వ బాలికల ప్రాథమిక డిజిటల్ పాఠశాలలో కార్పొరేటర్ విద్యా సంస్థలకు దీటుగా విద్యను అందిస్తోందని పాఠశాలల ఉప పర్యవేక్షకులు గుండప్ప అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలను హెచ్ఎం, ఉపాధ్యాయుల సమిష్టి కృషితో దాతల సహకారంతో డిజిటల్ పాఠశాలగా మార్చి అన్ని రకాల సౌకర్యాలు, ఉచితంగా పుస్తకాలు, సామగ్రీ అందిస్తూ ఉత్తమ విద్యా బోధనలు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శౌరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలి

హిమాయత్‌నగర్: ప్రస్తుతం సమాజం డిజిటల్ మయం అయిన నేపథ్యంలో పుస్తక పఠనాన్ని తప్పనిసరి అలవాటు చేసుకోవాలని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ చైర్‌పర్సన్ మణికొండ ప్రార్థన అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో 'పుస్తకాల ప్రపంచం' అనే థీమ్‌తో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రాంగణంలో పుస్తకాల స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్రపతి నిలయంలో జరగనున్న ప్రత్యేక ప్రపంచ పుస్తక దినోత్సవ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం లభించిందన్నారు.

పార్క్ చేసిన వాహనాల్లో పెట్రోల్ చోరీ

క్రైం కార్నర్..

అమీర్‌పేట: హాస్టల్ ముందు పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్ర వాహనంలో పెట్రోల్ చోరీ చేసిన వ్యక్తులపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.. బాపూనగర్‌లోని ఆర్.ఆర్.డీలక్స్ బాయ్స్ హాస్టల్‌లో కోరబండి సంజయ్ ఉంటున్నారు. మంగళవారం రాత్రి హాస్టల్ ముందు బైక్‌ను పార్క్ చేసి గదికి వెళ్లాడు. తెల్లవారుజామున బాత్రూమ్‌కు వెళ్లేందుకు బయటకు వచ్చి వరండాలో నిలబడి కిందకు చేశాడు. బైక్‌లోని పెట్రోల్‌ను దొంగలు కాజేస్తుండటాన్ని గమనించి కేకలు వేయడంతో దొంగలు పారి పోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్న పోలీసులు సీసీకెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

ప్రేమించానని నమ్మించి మోసం చేశాడు

అమీర్‌పేట: ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన పెళ్లికి నిరాకరించిన వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. అనంతపురానికి చెందిన యువతికి ఇన్‌స్టాగామ్ ద్వారా ఎస్ఆర్‌నగర్‌లో ఉండే ఒంగోలు సమీపంలోని రాజంపల్లి గ్రామానికి చెందిన దార్ల మురళి పరిచయమైయ్యాడు. యువతిని ప్రేమ పేరుతో నమ్మించాడు. హోటల్‌కు తీసుకెళ్లి సన్నిహితంగా గడిపాడు. ఇటీవల పెళ్లి ప్రస్తావన తేవడంతో ముఖం చాటేశాడు.దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ పండరి తెలిపిన మేరకు.. రైల్వేస్టేషన్ 3వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఒక వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న పోలీసులు అంబులెన్స్‌కు సమాచారం అందించి ఘటనా స్థలానికి వెళ్లారు. 35 ఏళ్ల వయసున్న సదరు వ్యక్తి అప్పటికే వ్యక్తి మృతిచెంది ఉన్నట్టు అంబులెన్స్ సిబ్బంది ధృవీకరించారు.

రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీ కొట్టిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్ రైల్వే పీఎస్ జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ నారాయణ తెలిపిన మేరకు.. చర్లపల్లి-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ల మధ్య మృతదేహం పడి ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టిన ప్రమాదంలో మృతి చెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

5.2 కిలోల గంజాయి పట్టివేత



నిందితులను అదుపులోకి తీసుకున్న డీటీఎఫ్, ఎస్‌టీఎఫ్‌డీ టీం పోలీసులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ఎక్సైజ్‌శాఖ సిబ్బంది రెండు కేసుల్లో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని 5.260 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. డీటీఎఫ్ ఈఎస్ శ్రీనివాస్‌రావు, సీఐ సౌజన్య తెలిపిన మేరకు.. నిర్మల్ ప్రాంతానికి చెందిన మలావత్ రాజేందర్, ఇందాల్ రాథోడ్ నగరంలో గంజాయిని విక్రయిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లా శివారు ప్రాంతాల నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి నగరంలో విక్రయించడం ప్రారంభించారు. బుధవారం కారులో గంజాయి ప్యాకెట్లు తీసుకుని నగరానికి వస్తుండగా బోయిన్‌పల్లి ప్రాంతంలో ఎక్సైజ్ ఎస్ఐ శివకృష్ణ నేతృత్వంలోని బృందం పోలీసులకు పట్టుబడ్డారు.

- కొండాపూర్ బొటానికల్ పార్కు సమీపంలో గంజాయి విక్రయిస్తున్న వెస్ట్ బెంగాల్‌కు చెందిన నారాయణ చౌదరి అనే వ్యక్తిని ఎస్‌టీఎఫ్‌డీ ఎస్ఐ జ్యోతి బృందం అదుపులోకి తీసుకుంది. ముగ్గురు నిందితులపై కేసులు నమోదు చేసిన పోలీసులు నిందితులను సికింద్రాబాద్, లింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

రైల్వే జీఎంతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య సమావేశం



సికింద్రాబాద్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం సమావేశమయ్యారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్ లో ఉన్న రైల్వే సమస్యలను పూర్తి చేయాలని ఈ సందర్భంగా జీఎంకు వినతి పత్రం అందజేశారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ లో కీలకమైన కాజీపేట జంక్షన్ ప్రాముఖ్యతను ఎట్టి పరిస్థితుల్లో తగ్గకుండా చూడాలని ఆమె రైల్వే జీఎంను కోరారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తార్నాక మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతిహరి

లాలాపేట: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను బుధవారం తార్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతి హరి ఆవిష్కరించారు. తార్నాక పింక్ పెరల్ ఫంక్షన్ హాల్లో బీఆర్‌ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యూత్ ప్రసిడెంట్ ఆలకుంట హరి ఆధ్వర్యంలో తార్నాక మున్సిపల్ డివిజన్ బీఆర్‌ఎస్ ముఖ్య నేతల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తార్నాక డివిజన్ బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తకాలు, పెన్నుల పంపిణీ



బొల్లారం: హిందూ మహా సేవక్ సంఘం అధ్యక్షుడు కార్తీక్ నేతృత్వంలో బుధవారం అనాథాశ్రమంలో పుస్తకాలు, పెన్నుల పంపిణీ చేశారు. ఫాదర్ బాలయ్య నగర్ సమీపంలోని ఆయుషా అనాథాశ్రమంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అన్ని మతాలను గౌరవిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలియజేశారు. కార్యక్రమంలో భవాని, వంశీ, శశ్వత్, నరసింహన్, బాలరాజ, అరవింద్, రషీద్, నాగేందర్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు వర్సిటీ పీహెచ్‌డీ ప్రవేశాలలో అక్రమాలు'

ఉస్మానియా యూనివర్సిటీ: సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు వర్సిటీ పీహెచ్‌డీ ప్రవేశాలలో అక్రమాలు జరిగాయని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నాగేశ్వర్ రావు బుధవారం ఆరోపించారు. నోటిఫికేషన్ మొదలు సీట్ల కేటాయింపు వరకు యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఎంఫిల్, నెట్, సెట్ అర్హత గల అభ్యర్థులను విస్మరించి పీహెచ్‌డీ అడ్మిషన్లు జరిగాయన్నారు. విచారణ చేపట్టి ప్రవేశాలను రద్దు చేసి తిరిగి పారదర్శకంగా పీహెచ్‌డీ ప్రవేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



ఆలయ వార్షికోత్సవ వేడుకలకు హాజరైన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్ కాలనీలోని శ్రీబంగారు మైసమ్మ అమ్మవారి దేవాలయ 9వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం కన్నుల పండువగా జరిగాయి. ఉదయం సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం మైసమ్మ అమ్మవారికి కుంభాభిషేకం, పంచ హారతులు, మహాచండీహోమం నిర్వహించిన మీదట అమ్మవారి దర్శనం కోసం భక్తులను అనుమతించారు. అనంతరం బంగారు మైసమ్మ కల్యాణోత్సవం జరిపించారు. ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవ వేడుకలకు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి హాజరయ్యారు.

స్థానిక సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే



బాలంరాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకుంటున్న శ్రీగణేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం మూడో వార్డు బాలంరాయి, కార్ఖాన బస్తీల్లో ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. బాలంరాయిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అదనపు బెడ్స్ ఏర్పాటు చేయాలని కోరగా బోర్డు సీఈవో మధుకర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లి అదనపు గదులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్ఖానలో సమస్యలు పరిష్కరిస్తా..

కార్ఖానలో బోర్డు శానిటేషన్ సూపరిటెండెంట్ మహేందర్. ఇతర అధికారులతో కలసి శ్రీగణేష్ పర్యటించారు. బస్తీ పర్యటనలో భాగంగా తన దృష్టికి వచ్చిన తాగునీరు, శానిటేషన్, సీసీరోడ్లు,ఓపన్ నాలాలు, విద్యుత్ స్థంబాల ఏర్పాటు ఇతర సమస్యల పరిష్కారానికి నిధుల విడుదల విషయమై ఎస్టీమేషన్ సిద్ధం చేయాలని అధికారులను సూచించారు.

బడి ఈడు పిల్లలను బడుల్లో చేర్పించాలి



తుకారాంగేట్ ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో బస్తీబాట కార్యక్రమం

అడ్డగుట్ట: బడీడు పిల్లలందరినీ బడుల్లో చేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని మారేడుపల్లి డిప్యూటీ ఐఓఎస్ మదన్ మోహన్ అన్నారు. బుధవారం తుకారాంగేట్ ఎంసీహెచ్ క్వార్టర్స్‌లోని ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో తుకారాంగేట్, మరాఠా బస్తీ తదితర ప్రాంతాల్లో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పవన్ రాజ్, టీచర్లు రామలక్ష్మి, కరుణాశ్రీ , సునీత, గీత పాల్గొన్నారు.

ఓయూలో అశోక చక్రవర్తి శాసనాల ప్రదర్శన



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొ.కుమార్, ప్రొ.వంశీధర్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అశోక చక్రవర్తి పాలన కాలం నాటి శాసనాలు, పురాతన స్మారకాలను ప్రదర్శించారు. బుధవారం ఫిలాసఫీ విభాగం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వీసీ ప్రొ.కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఫిలాసఫీ హెడ్ ప్రొ.వంశీధర్ వీసీకి ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చిత్రాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొ.కాశీం , డా.పల్లెర్ల సుధాకర్, డా.అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

అడ్డగుట్ట: బిఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 27న నిర్వహించతలపెట్టిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం అడ్డగుట్టలోని కార్పొరేటర్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ రాజు సుందర్, సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, నక్క మధు, సత్తయ్య గౌడ్ పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

ఉగ్రదాడిని నిరసిస్తూ నిరసన ర్యాలీ



లాలాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పెహల్గాం మృతుల ఆత్మశాంతి కోసం మోక్షదీపాలు వెలిగిస్తున్న వేదపండితులు

లాలాపేట: జమ్ము కాశ్మీర్‌లోని పహల్‌గామ్ పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బుధవారం రాత్రి లాలాపేటలో స్థానికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. మతం పేరిట పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడి చేయడాన్ని ప్రజలందరూ ముక్త కంఠంతో తీవ్రంగా ఖండించారు. దాడిలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు.

పద్మారావునగర్: జమ్ము కాశ్మీర్ లోని పెహల్గాం లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మశాంతిని కాంక్షిస్తూ బుధవారం రాత్రి పద్మారావునగర్‌లోని స్కందగిరి శ్రీసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో వేదపండితులు మోక్ష దీపాలు వెలిగించారు. ఆలయ వేదపండితులు కన్నన్ గురుకల్, రాజేశ్ గురుకల్, భరద్వాజ్ గురుకల్, శ్రీరామ్ గురుకల్, సిబ్బంది కాశీనాథ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మెకు ఎంపీ, ఎమ్మెల్యేల మద్దతు



సమ్మెకు హాజరైన కాంట్రాక్టు అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఎంపీ, ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. బుధవారం చలో ఉస్మానియా పిలుపు మేరకు రాష్ట్రంలోని 12 వర్సిటీలకు చెందిన కాంట్రాక్టు అధ్యాపకులు ఆర్ట్స్ కాలేజీ నుంచి ఓయూ పాలన భవనం వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం పాలనా భవనం ఎదుట ఏర్పాటు చేసిన సమ్మెకు రాజ్యాసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, పీవోడబ్ల్యూ సంధ్య, ఉన్నత విద్య మండలి మాజీ చైర్మన్ ప్రొ.పాపిరెడ్డి తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడారు.

ఆలయానికి వచ్చి నీటి సంపులో పడి మృతి



బాలాజీ

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి దర్శనం కోసం కుటుంబ సమేతంగా వచ్చిన ఓ వ్యక్తి బుధవారం నీటి సంపులో పడి మృతి చెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. కాచిగూడకు చెందిన ఫ్రూట్ షాపు నిర్వాహకుడు బి.బాలాజీ (48) కుటుంబ సభ్యులతో కలిసి ఎల్లమ్మ ఆలయానికి వచ్చాడు. కొబ్బరి కాయలు కొట్టే చోట నీటి సంపులో ఫోన్ పడిపోయింది. దీంతో ఈ విషయం సిబ్బంది తెలిపాడు. వారు పట్టించుకోకపోవడంతో తానే ఫోన్ తీసేందుకు యత్నించి సంపులో పడిపోయాడు. గమనించిన అక్కడి సిబ్బంది నిచ్చన సాయంతో బాలాజీని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడు అభిషేక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.